12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 305 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం బుధవారం 9 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 305 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM WED 9 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## నేడు కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన..

- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- రైతులతో నేరుగా సమావేశమై సమస్యలు తెలుసుకోనున్న సీఎం
- గ్రౌండ్ రెంట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియకు శ్రీకారం
- 1,416 కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా కీలక నిర్ణయం

- మిగతా 2లో

## చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు..

నేడు 'నిజం గెలిచింది' కార్యక్రమానికి పిలుపునిచ్చిన నారా లోకేశ్



- నేడు 53 దీపాలు వెలిగించండి.. టీడీపీ శ్రేణులకు లోకేశ్ కీలక సందేశం
- పార్టీ, పర్సనల్, ప్రభుత్వం అనే మూడు 'పీ'ల సూత్రాన్ని నేతలు పాటించాలని దిశానిర్దేశం
- కార్యకర్తల పోరాటాలు, త్యాగాల వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య
- వైసీపీ దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని శ్రేణులకు సూచన
- ఇది టీడీపీ 3.0 వెర్షన్.. అహంకారం వీడి సేవ చేయాలని నేతలకు హితవు

- మిగతా 2లో

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- స్థానిక ఎన్నికలు.. అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలి: సీఎం చంద్రబాబు
- కూటమిలో సమన్వయంతో పనిచేయాలని సూచన
- పార్టీకి నష్టం చేస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరిక
- ప్రభుత్వ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి సమన్వయం వరకు ప్రతి అంశంలోఅప్రమత్తంగా ఉండాలని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. అమరావతిలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లోస్థానిక ఎన్నికల సన్నాహాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగాపనిచేస్తూనే కూటమిలో బ్యాలెన్సింగ్ పాటించాలని సూచించారు. సీట్లు, రిజర్వేషన్లపై కొందరు కోర్టులకు వెళ్లినా.. ప్రత్యక్ష ఎన్నికలద్వారా మేయర్లు, ఛైర్మన్లను ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబుతెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా.. పార్టీకి, ప్రభుత్వానికిచెడ్డపేరు రాకుండా అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కమిటీలద్వారా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలనిసూచించారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో నేతలంతా కలిసికట్టుగాపనిచేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే సస్పెన్షన్‌వేటు తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. వైకాపా దుష్ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు స్పష్టం చేశారు. వైకాపా ఫేక్ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టి ఓటు బ్యాంక్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఓటు వేయని వారినీ చేసిన అభివృద్ధితో ఆకట్టుకుని పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

## ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం

- ఏపీలో 54% లోటు వర్షపాతం నమోదైందని చంద్రబాబు వెల్లడి
- సంక్షోభంలో తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం
- బోర్లు ఎండిపోయిన ప్రాంతాల్లో తాగునీటి కొరత రాకుండా చర్యలు
- పీఎండీఎస్ విధానంతో పంటల సాగును ప్రోత్సహించాలని సూచన
- జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయని ఆందోళన
- ఉచిత ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా అడ్డుకోవాలని ఆదేశం

- మిగతా 2లో


## వైసీపీ నుంచి టీడీపీలోకి ఇంకా వస్తారు

టీడీపీలో చేరిన అనంతరం చిన్న శ్రీను వ్యాఖ్యలు

- వైసీపీ సీనియర్ నేత బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరిక
- వైసీపీ నుంచి ఇంకా చాలామంది టీడీపీలోకి వస్తారంటూ సంచలన వ్యాఖ్యలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుమార్తెతో సహా పార్టీలో చేరిక
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడి
- చిన్న శ్రీను వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో వలసలపై కొత్త చర్చ

- మిగతా 2లో







## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్.. దరఖాస్తు గడువు పెంపు

- తెలంగాణ పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు
- సెప్టెంబర్ 16 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం
- మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జూలై 29న నోటిఫికేషన్
- ఇప్పటివరకు 2.88 లక్షల మంది దరఖాస్తు ప్రక్రియ పూర్తి
- చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు రావొచ్చని బోర్డు సూచన

- మిగతా 2లో

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం




- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

పెన్ పవర్ డెస్క్:గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు.

- మిగతా 2లో

## యూరియా కలిసిన దాణా తిని 18 ఆవుల మృత్యువాత



పెన్ పవర్ డెస్క్: యూరియా కలిసిన దాణా తినడంతో ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలోని గోశాలలో చోటుచేసుకుంది. ఓ రైతు నిల్వ చేసిన బస్తాల్లోని యూరియా వర్షానికి కరిగి గోవుల దాణాలో కలిసింది. మంగళవారం ఉదయం ఆ దాణా తినడంతో 18 ఆవులు మృతిచెందాయి.

- మిగతా 2లో

## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో సంచలన తీర్పు.. దోషికి ఉరిశిక్ష

- తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో పోక్సో కోర్టు సంచలన తీర్పు
- ప్రధాన నిందితుల్లో ఒకరికి మరణశిక్ష విధింపు
- మరో ఇద్దరికి 20 ఏళ్లు, 13 ఏళ్ల జైలుశిక్ష
- 2022లో మైనర్‌పై పెళ్లి పేరుతో అత్యాచారానికి పాల్పడిన నిందితులు

- మిగతా 2లో



## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన ఐఏఎస్ నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ రాజు మృతి

పెన్ పవర్ డెస్క్: తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తున్న రాజు మృతి చెందారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో

- మిగతా 2లో



## సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

పెన్ పవర్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు పుతిన్ ( తో భేటీ కానున్నారు. ఈ నెల 12-13 తేదీలలో దిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# విజయసాయి రెడ్డి రాజకీయ టార్గెట్ ఏంటి?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా నిలవడానికి కొత్త పార్టీని స్థాపించి, ప్రజా సమస్యలపై పోరాడటమే ప్రస్తుత రాజకీయ టార్గెట్ అని విజయసాయి రెడ్డి చెబుతున్నారు. కానీ విజయసాయిరెడ్డి మీడియా సమావేశంలో చెప్పిన వ్యాఖ్యలు చూస్తే ఆయనకు ఒక దారి తెన్నూ లేనట్లే కనిపిస్తుంది. ఆయనతో కలసి వచ్చేదెవరు? విజయసాయి రెడ్డి కొత్త పార్టీ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. అలాగే తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కానని, కేవలం తాను మెంటర్ ను మాత్రమేనని విజయసాయిరెడ్డి చెప్పారు. తనకు తాను మహారాష్ట్రలోని శివసేన అధినేత బాలథాక్రేతో పోల్చుకున్నారు. తాను ఒక మెంటర్ గానే ఉంటానని, అణగారిని వర్గాలకు మాత్రమే ముఖ్యమంత్రి పదవి దక్కుతుందని చెబుతున్నారు.

**నమ్మి వచ్చేదెవరు?**

వైఎస్సార్‌సీపీకి దూరమైన ఆయన, ఆంధ్రప్రదేశ్ లో సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ రెండు ప్రధాన పార్టీలకు వ్యతిరేకంగా రాజకీయాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ధరల నియంత్రణ, రుణ విముక్తి వంటి అంశాలను తన అజెండాగా విజయసాయిరెడ్డి ప్రకటించారు. తాను మాత్రం ముఖ్యమంత్రి పదవి రేసులో లేనని, ప్రజల గొంతుకగా నిలవడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. అనుభవం, సమర్థులైన, నాయకత్వ పటిమ ఉన్న అణగారిన నేత ముఖ్యమంత్రి అభ్యర్థి అవుతారని విజయసాయిరెడ్డి చెప్పడానికి, వినడానికి బాగానే ఉంది. ఆయనను నమ్మి పార్టీలోకి వచ్చేదెవరు? ప్రస్తుతం ఏపీలో కూటమి, వైసీపీ బలంగా ఉంది. మూడో ప్రత్యామ్నాయానికి అవకాశమే లేదు.

**కాంగ్రెస్ కే దిక్కు లేనప్పుడు...**

మూడో ప్రత్యామ్నాయానికి అవకాశం లేనప్పుడు, పొలిటికల్ వ్యాక్యూమ్ లేనప్పుడు విజయసాయిరెడ్డి పార్టీ పెట్టడం ఎందుకన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. అయితే జగన్ వర్గాన్ని టార్గెట్ చేయడానికే సాయిరెడ్డి పార్టీ పెడుతున్నట్లు అంచనాలు వినపడుతు న్నాయి. విజయసాయిరెడ్డి ఇప్పటి వరకూ నాయకుడిగా రాణించలేదు. కేవలం రాజ్యసభ సభ్యుడిగానే రెండుసార్లు అదీ జగన్ అవకాశం ఇచ్చినందునే ఆయనకు అవకాశం దక్కిం ది. అటువంటి సాయిరెడ్డిని నమ్మి రెడ్డి సామాజికవర్గం నేతలు కానీ, బలహీన వర్గాల నేతలు కానీ పార్టీలోకి వస్తారా? అన్న సందేహం అందరిలోనూ కలుగుతుంది. వైఎస్ షర్మిల నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీకే ఆంధ్రప్రదేశ్ లో దిక్కులేదు. ఇక విజయసాయిరెడ్డి వైపు దేకెదరు? అన్న కామెంట్స్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తుంది. మరి సాయిరెడ్డి రాజకీయ వ్యూహం ఏంటో చూడాల్సిందే.

## సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

- మొదటి పేజి తరువాయి

ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని.. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో సహకారం విస్తరిస్తోందన్నారు.

ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశం లో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట వేయనున్నారని డిమిత్రి పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం వంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ మధ్యవర్తిత్వం వహించడం తమకు అంగీకారమేనని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలు తిరిగి ప్రారంభించడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు.

**బ్రిక్స్ ఇప్పుడు ఒక భారీ కూటమి..**

బ్రిక్స్ కేవలం ఒక సాధారణ సంస్థ మాత్రమే కాదని..అదొక ప్రధాన ప్రపంచ కూటమి అని డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొంటే బాగుంటుందని.. ఇతర దేశాలను ఆహ్వానించడానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్‌తో అణు సహకారంపై దృష్టి..**

రష్యా-భారత్ సహకారంలో అణు శక్తి ఒక కీలక రంగమని డిమిత్రి పేర్కొన్నారు. 'అణు రంగంలో రష్యా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మేమే ఎక్కువ అణు విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నాం. భారత్‌లో కుడంకుళం ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారత్‌లో నిర్మించబోయే మరో కొత్త ప్లాంట్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు.

# నేడు కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన..

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పాలనను పరుగులు పెట్టిస్తున్న ఆయన, ఈ పర్యటనలో భాగంగా పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పి. గన్నవరం నియోజకవర్గంలో నిర్వహించే గ్రామసభలో పాల్గొని, లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఈ పర్యటనలో రైతులతో ముఖాముఖి, గ్రామసభ, పార్టీ కేడర్‌తో సమావేశం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. దశాబ్దాలుగా నలుగుతున్న గ్రౌండ్ రెంట్ భూముల సమస్య పరిష్కారానికి ఈ పర్యటనలో కీలక అడుగు పడనుంది.

**ముఖ్యమంత్రి పర్యటన పూర్తి షెడ్యూల్**

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఈ విధంగా ఉంది. ఉదయం 9:45 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి బయలుదేరి, 10:30 గంటలకు అంబాజీపేట మండలం ఇరుసుమండ చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. అనంతరం 10:45 గంటలకు రోడ్డు మార్గంలో మాచవరం గ్రామంలోని జయంతి నగర్‌కు బయలుదేరతారు. ఉదయం 10:55 నుంచి 11:35 గంటల వరకు జయంతి నగర్‌లో ఏర్పాటు చేసిన 'రైతులతో ముఖాముఖి' కార్యక్రమంలో పాల్గొంటారు. రైతుల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 11:40 గంటలకు పండువారిపేటలోని గ్రామసభ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:55 గంటల వరకు 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసి, భూ హక్కుల పరిరక్షణపై ప్రజలకు వివరిస్తారు. మధ్యాహ్నం 3:15 గంటలకు బుడుంగపేటలో జరిగే కేడర్ సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 4:50 గంటలకు ఇరుసుమండ నుంచి తిరుగు ప్రయాణమై, 5:40 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది.

**గ్రౌండ్ రెంట్ భూములకు విముక్తి**

కోనసీమ జిల్లాలో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని గ్రౌండ్ రెంట్ భూముల సమస్యకు ఈ పర్యటనలో ముగింపు పలకనున్నారు. అమలాపురం, అంబాజీపేట, ముమ్మిడివరం, రామచంద్రాపురం ప్రాంతాల్లోని 56.37 ఎకరాల నివాస స్థలాలు పాత రెవెన్యూ రికార్డుల కారణంగా రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22–ఎ నిషేధిత జాబితాలో ఉన్నాయి. దీంతో 1,416 కుటుంబాలు తమ ఆస్తులపై హక్కులున్నా క్రయవిక్రయాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. క్షేత్రస్థాయి విచారణల అనంతరం, ఈ భూములను 22–ఎ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయంతో 1,281 సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై, వేలాది మందికి ఉపశమనం కలగనుంది.

**'మీ భూమి--మీ హక్కు'తో భరోసా**

'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమాన్ని ప్రభుత్వం కేవలం పట్టాల పంపిణీగా కాకుండా, రైతు గౌరవాన్ని, పౌరుడి ఆస్తి హక్కును కాపాడే ఉద్యమంగా చూస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్ది, స్పష్టమైన భూ రికార్డులు అందించేందుకు 'రీ-సర్వే 2.0'ను అమలు చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 36 లక్షలకు పైగా పాస్‌పుస్తకాలు పంపిణీ చేయగా, వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'నీరు జీవం... భూమి జీవితం' అనే నినాదంతో పంటకు నీటి భరోసాతో పాటు, ఆస్తికి హక్కు భరోసా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే నిజమైన పాలన అని భావించే చంద్రబాబు, ఈ పర్యటన ద్వారా కోనసీమ వాసులకు భూ హక్కుల భరోసా కల్పించనున్నారు.

# చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు..

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నేటితో (సెప్టెంబర్ 9) మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'నిజం గెలిచింది' పేరిట రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో నిర్బంధించినందుకు నిరసనగా, ఆయన నిర్దోషిగా బయటకు వచ్చినందుకు గుర్తుగా పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ స్థాయిలో 53 దీపాలు వెలిగించి, ఆ రోజును 'బ్లాక్ డే'గా పాటించాలని ఆయన శ్రేణులకు సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో లోకేశ్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. కార్యకర్తల పోరాటాలు, త్యాగాల పునాదులపైనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. "ఒక తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, మంజుల వంటి కార్యకర్తలపై గత ప్రభుత్వం దాడులు చేసింది. కొందరిని హతమార్చింది. వారి త్యాగాల వల్లే మనం ఇవాళ నాయకులుగా ఉన్నాం. ఈ విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దు" అని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. నాయకులకు శిక్షణ ఇచ్చేందుకు, ప్రజలకు మరింత చేరువయ్యే వ్యూహాలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి కాంక్లేవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

**నేతలకు 'త్రీ-పీ' మంత్రం**

నాయకులంతా మూడు 'పీ'ల (పార్టీ, పర్సనల్, ప్రభుత్వం) సూత్రాన్ని తప్పక పాటించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగతంగా (పర్సనల్) ప్రజలకు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, మానవత్వం, అణకువతో వ్యవహరించాలని హితవు పలికారు. "ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రధాని మోదీ గారి నుంచి నేను ఈ విషయం నేర్చుకున్నాను. ఆయన నా నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. మనం కూడా విమర్శలను స్వీకరించి మార్పు చేసుకోవాలి" అని అన్నారు. రెండో 'పీ' అయిన పార్టీ విషయంలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని, అలకబూనిన వారిని దగ్గరకు తీసుకోవాలని సూచించారు. ఇక మూడో 'పీ' అయిన ప్రభుత్వం గురించి మాట్లాడుతూ.. నేతలు కేవలం పోస్ట్ ఆఫీసుల్లా కాకుండా, తమ నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపే లీడర్లలా వ్యవహరించాలని కోరారు. పాఠశాలలు, ఆసుపత్రులను తనిఖీ చేస్తూ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు.

**వైసీపీ దుష్ప్రచారంపై ఐక్య పోరాటం**

వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. డీఎస్సీపై మేం చిత్తశుద్ధితో 16 వేల పోస్టులు భర్తీ చేశాం. ఈ ఐదేళ్లలో 30 వేల పోస్టులు భర్తీ చేస్తాం. పోలీస్ నియామకాల్లోనూ అంతే. అయినా మనపైనే విమర్శలు చేస్తున్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలి" అని అన్నారు. సొంత బాబాయి హత్య కేసు, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడని జగన్.. కేవలం డీఎస్సీపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్ అని, 'నో ఇగో, ఓన్లీ సర్వీస్' అనే నినాదంతో పనిచేయాలని లోకేశ్ స్పష్టం చేశారు. "పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ కట్టుబడి ఉండాలి. అహంకారం వద్దు, కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం" అని ఆయన ముగించారు. తన ఎదుగుదలకు కారణం కార్యకర్తల సహకారమేనని లోకేశ్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన ఐఏఎస్ నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ రాజు మృతి

- మొదటి పేజి తరువాయి

ఉదయం అసెంబ్లీ ఆవరణలో అకస్మాత్తుగా కుప్పకూలారు. రాజు కుప్పకూలడాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించి ఆయనకు సీపీఆర్ చేశారు. అనంతరం చికిత్స నిమిత్తం రాజును ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. అసెంబ్లీ ఆవరణలోనే రాజు మృతి చెందడంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. రాజు మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం

అమరావతి: ఎల్‌నినో వల్ల ఏపీపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 54శాతం లోటు వర్షపాతం నమోదైందని, జలాశయాల్లో గతేడాది 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి 530 టీఎంసీలే ఉందని తెలిపారు. ఎల్‌నినోపై జరిగిన చర్చలో నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయని అన్నారు. "నెల్లూరు, తిరుపతి, కోనసీమ జిల్లాల్లో వేయాల్సిన దానికన్నా ఎక్కువగా పంటలు వేశారు. మార్కాపురం, పోలవరం, ప్రకాశం జిల్లాల్లో 12శాతం పంటలే వేశారు. ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తాం. బోర్లు ఎండిపోయిన చోట తాగునీటి కొరత లేకుండా చూడాలి. ప్రతి ఎకరాన్నీ పీఎండీఎస్ విధానంలో సాగు చేసేలా చూడాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు అవకాశం ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు మా ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేసింది.

ఉచిత ఇసుక.. ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోవాలి. ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకొని ఉచిత ఇసుక ఇస్తున్నాం. వైకాపా పాలనలో జే బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించేందుకు వీల్లేదు. గొడ్డలి పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలా బరితెగించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించ కూడదు" అని చంద్రబాబు అన్నారు.

## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్..

# దరఖాస్తు గడువు పెంపు

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్‌ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి.

ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు

ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- మొదటి పేజి తరువాయి

తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా ద

మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో సంచలన తీర్పు.. దోషికి ఉరిశిక్ష

మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది

# వైసీపీ నుంచి టీడీపీలోకి ఇంకా వస్తారు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంగళవారం ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. వైసీపీ నుంచి ఇంకా చాలామంది నేతలు టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చిన్న శ్రీను, ఆయన కుమార్తె సిరి సహస్ర టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బేబినాయన, అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు వంటి పలువురు ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత రెండేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగుపెడుతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, విజయనగరం జిల్లా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతూ ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టే వారి ప్రయత్నంలో నేను కూడా భాగస్వామిని కావాలనుకుంటున్నాను. ఈ అభివృద్ధి యజ్ఞంలో పాలుపంచుకోవాలనే తపనతోనే టీడీపీలో చేరాను" అని వివరించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ముందు జగన్‌కు స్వాగతం పలికిన మీరు, ఇంత సడన్‌గా పార్టీ మారడానికి కారణమేమిటని విలేకరులు ప్రశ్నించగా.. గత రెండేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగం కావాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని బదులిచ్చారు. "వైసీపీ నుంచి ఇంకా ఎవరైనా వస్తారా?" అన్న ప్రశ్నకు, "ఇంకా వస్తారు.. చాలామంది వస్తారు" అని ఆయన నొక్కి చెప్పడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాకు వెళ్లాక మరిన్ని విషయాలు పూర్తిస్థాయిలో వెల్లడిస్తానని తెలిపారు.

# చర్మ వృత్తులు డప్పు కళాకారుల పెన్షన్ ఆన్లైన్ విధానం సరి చేయండి.

### గోకవరం ఎంపీడీవో గోవిందు కు వినతిపత్రం.



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 08:-** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అతి తొందరలో ప్రజలకు అందించనున్న పెన్షన్ల విధానంలో డప్పు కళాకారులు చర్మవృత్తుల వారికి అందిస్తున్న పెన్షన్ దరఖాస్తు ఆన్లైన్ విధానంలో కొన్ని శాంతి సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని వాటిని తక్షణం సరి చేయించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మోర్తా చిట్టిబాబు ఆధ్వర్యంలో పలువురు ఎమ్మార్పీఎస్ సోదరులు గోకవరం ఎంపీడీవో ఎం గోవింద్ కి వినతిపత్రం అందించారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం గోవిందం కలిసి విషయాన్ని వివరించి వినతిపత్రం అందజేశారు.

పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే గడువు చాలా తక్కువగా ఉన్నవి గనక సహాయ ఆలోచనలు చేపట్టాలని గోకవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మోర్త చిట్టీబాబు కోరారు. వినతి పత్రం అందజేసి ఉన్నారు ఈ కార్యక్రమంలో గంపల ప్రసాదు పెనుముచ్చి అచ్చియ్య ములపర్తి బుజ్జి తాళ్లూరి నాని మోర్తా చిన్ని కొత్తపల్లి అచ్యుతాపురం కామరాజుపేట తంటికొండ తిరుమలయా పాలెం గోకవరం గ్రామాలకు సంబంధించిన డప్పు కళాకారులూ చర్మకారులు పాల్గొని యున్నారు.

## విద్యార్థులూ చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి



– ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. విద్యార్థి దశలోనే మంచి విలువలు, నైతికత, క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరన్నారు. మోరంపూడి శ్రీనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాల లో నిర్వహించిన 'మీ భద్రత.. మా బాధ్యత' కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత సోషల్ మీడియాలో రీల్స్ చూస్తూ సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని, మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. రోడ్డు నియమాలను పాటించాలని వివరించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుర్తుతెలి యని వ్యక్తులు ఇచ్చే ప్యాకెట్లను పరిశీలించ కుండా తీసుకెళ్లవద్దని హెచ్చరించారు.తెలియ కుండా చేసినా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర వుతాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎస్పీ సహకారంతో నియోజకవర్గంలో 'మహిళా రక్షక్' బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శక్తి టీమ్స్ మహిళా కళాశాలల వద్ద ప్రత్యేకంగా పనిచేస్తున్నాయని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ముగించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, మహిళా పోలీసు విభాగాలకు చెందిన అధికారులు మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల నివారణ, మహిళల రక్షణ, చట్టపరమైన అంశాలపై పలు సూచనలు చేశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

### అర్హులైన ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 16లోగా

# పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

### కొత్త పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం/ దేవీపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ పథకం కింద కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియను పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మంగళవారం దేవీపట్నం మండలం కొండమొదలు సచివాలయంలో ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పథకం ప్రయోజనం అందేలా దరఖాస్తుల స్వీకరణ, ధ్రువపత్రాల పరిశీలన తదితర ప్రక్రియలను నిబంధనల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సంబంధిత తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కొండమొదలు సచివాలయం పరిధిలో సోమవారం కొత్తగా పెన్షన్ కోసం 20 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సచివాలయ పరిధిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల దరఖాస్తుల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏర్పాటు చేసిన పెన్షన్ నియంత్రణ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తూ అవసరమైన చోట లబ్ధిదారులకు చేయూతనందించాలని సూచించారు.

మండలాలు, డీఆర్‌డీఏ, సెర్ప్ రాష్ట్ర కార్యాలయం మధ్య సమన్వయంతో మొత్తం ప్రక్రియను నిర్వహించాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనకు తావులేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

**కేటగిరీల వారీగా ధ్రువపత్రాలు**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద వివిధ కేటగిరీలకు దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, బియ్యం కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.వృద్ధాప్య పెన్షన్‌కు వయస్సు రుజువుగా ఆధార్ కార్డు, వితంతు పెన్షన్‌కు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భర్త ఆధార్ నంబర్ అవసరమని పేర్కొన్నారు. ఒంటరి మహిళల విషయంలో వివాహితులైతే కోర్టు లేదా అదాలత్ నుంచి విడాకుల డిక్రీ, అవివాహితులైతే తహసీల్దార్ జారీ చేసే వివాహేతర ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.వికలాంగుల పెన్షన్‌కు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యాన్ని నిర్ధారించే సదరం సర్టిఫికేట్ అవసరమని తెలిపారు. నేతలకు చేనేత, వస్త్ర పరిశ్రమ శాఖ ధ్రువీకరణ పత్రం, మత్స్యకారులకు మత్స్యశాఖ సర్టిఫికేట్, డప్పు కళాకారులు, సాంప్రదాయ చెప్పులు కుట్టేవారికి సామాజిక సంక్షేమ శాఖ ధ్రువీకరణ పత్రాలు అవసరమని పేర్కొన్నారు. టాడీ టాపర్లకు నిషేధ మరియు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ పత్రం, ట్రాన్స్‌జెండర్లకు జిల్లా మెడికల్ బోర్డు సర్టిఫికేట్ అవసరమని అధికారులు వివరించారు.ప్రతి అర్హుడికి పథకం ప్రయోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి ధ్రువపత్రాల పరిశీలన వరకు ప్రతి దశలో నిబంధనలను పాటిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డి. రత్నాకర్‌రావు, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరం ఆర్టీసీ డిపో -- వస్తుందా? సర్వేలతోనే సరిపెడతారా?




- విజయవాడ నుంచి వచ్చిన ఎండీ కార్యాలయ సాంకేతిక బృందం క్షేత్రస్థాయి పరిశీలన
- 12 మండలాల గిరిజనుల ఆశలకు కొత్త ఊపిరి... నిర్ణయం కోసం ఉత్కంఠ
- "బస్సు వస్తేనే రోడ్డు... రోడ్డు వస్తేనే జీవితం" అంటున్న ఏజెన్సీ ప్రజలు



**గంగవరం/రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 8 :**దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రంపచోడవరం ఆర్టీసీ డిపో అంశంలో ఎట్టకేలకు కదలిక కనిపిస్తోంది. పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో పూర్తి స్థాయి ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలంటూ స్థానికులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో విజయవాడలోని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ కార్యాలయం నుంచి ప్రత్యేక సాంకేతిక బృందం రంపచోడవరం చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడం ఏజెన్సీ ప్రజల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.

**అయితే గిరిజన ప్రాంత ప్రజల ముందున్న ప్రశ్న మాత్రం ఒక్కటే...**

"ఈసారి నిజంగానే డిపో వస్తుందా...? లేక మరోసారి సర్వేలు, నివేదికలతోనే కథ ముగుస్తుందా?"

**బస్టాండ్ వెనుక స్థల పరిశీలన... గోకవరం డిపో సందర్శన**

రంపచోడవరం బస్టాండ్ వెనుక భాగంలో అందుబాటులో ఉన్న స్థలం, పరిసర రహదారులు, ప్రభుత్వానికి చెందిన ఖాళీ భూములను సాంకేతిక బృందం పరిశీలించినట్లు సమాచారం. పూర్తి స్థాయి డిపో ఏర్పాటుకు అవసరమైన భూమి, మౌలిక వసతులు, బస్సుల రాకపోకలకు అనువైన రహదారులు తదితర అంశాలను అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది.

అనంతరం గోకవరం ఆర్టీసీ డిపోను కూడా సందర్శించి అక్కడి నిర్వహణ విధానం, బస్సుల సామర్థ్యం, మౌలిక సదుపాయాలను అధ్యయనం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం డిపో ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై నివేదిక సిద్ధం చేసే ప్రక్రియలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ పరిణామం ఏజెన్సీ ప్రజల్లో ఆశలు పెంచుతున్నప్పటికీ, గతంలో అనేక సమస్యలు సర్వేలు, ప్రతిపాదనలు, నివేదికల దశలోనే నిలిచిపోయిన నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**12 మండలాల చూపు... రంపచోడవరం డిపోపైనే!**

రంపచోడవరంలో పూర్తి స్థాయి ఆర్టీసీ డిపో ఏర్పాటైతే ఏజెన్సీలోని పలు మండలాలకు రవాణా పరంగా కొత్త ఊపిరి లభిస్తుందని గిరిజనులు ఆశిస్తున్నారు.రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, చింతూరు, కూనవరం, గంగవరం, వీఆర్‌పురం తదితర మారుమూల మండలాలతో పాటు అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి తదితర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.ప్రస్తుతం కొన్ని మండలాలు గోకవరం డిపో, మరికొన్ని ప్రాంతాలు ఏలేశ్వరం డిపోలపై ఆధారపడుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఉన్న రంపచోడవరానికి పలు మండలాల నుంచి నేరుగా, సమయానుకూలంగా బస్సు సర్వీసులు లేకపోవడం ప్రజలకు పెద్ద సమస్యగా మారింది.

**జిల్లా కేంద్రానికి చేరుకోవాలన్నా బస్సు లేదు... ఆసుపత్రికి వెళ్లాలన్నా ప్రయాణమే పరీక్ష!**

వందలాది మారుమూల గిరిజన గ్రామాలకు ఇప్పటికీ సరైన ప్రజా రవాణా సౌకర్యం అందుబాటులో లేదని స్థానికులు చెబుతున్నారు. కొన్ని గ్రామాలకు ఉదయం ఒక బస్సు వెళ్లి, తిరిగి మరో సర్వీసు కోసం సాయంత్రం వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, ప్రభుత్వ కార్యాలయాల పనులు... ఏ అవసరం వచ్చినా ప్రయాణమే మొదటి సమస్యగా మారుతోందని గిరిజనులు అంటున్నారు.

**మారేడుమిల్లికి పర్యాటక హోదా... కానీ సాయంత్రం బస్సు లేదు!**

దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న మారేడుమిల్లి పర్యాటక ప్రాంతం ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రకృతి అందాలు, జలపాతాలు, అటవీ ప్రాంతాలతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న మారేడుమిల్లికి రవాణా సౌకర్యాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని స్థానికులు పేర్కొంటున్నారు.ముఖ్యంగా సాయంత్రం తర్వాత సరైన బస్సు సర్వీసులు లేకపోవడం స్థానికులతో పాటు పర్యాటకులను కూడా ఇబ్బందులకు గురిచేస్తోంది.పూర్తిస్థాయి రంపచోడవరం డిపో ఏర్పాటైతే పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు, అదనపు బస్సుల నిర్వహణకు అవకాశం ఏర్పడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

**చదువుకోసం నగరాలకు... బస్టాండ్‌లలో విద్యార్థుల నిరీక్షణ**

ఏజెన్సీ ప్రాంతాల నుంచి అనేక మంది గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య కోసం రాజమహేంద్రవరం, కాకినాడ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది.

అయితే పరిమిత బస్సు సర్వీసులు, అనుకూలం కాని సమయాలు, రాత్రి వేళల్లో రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కొన్నిసార్లు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది.

**అత్యవసరమైతే ప్రాణాలకే పరీక్ష!**

చింతూరు, కూనవరం, వై.రామవరం తదితర మారుమూల ప్రాంతాల్లో రవాణా సమస్య మరింత తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

ముఖ్యంగా అత్యవసర వైద్య పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, చిన్నారులను ఆసుపత్రులకు తరలించడం కుటుంబాలకు పెను సవాలుగా మారుతోంది.

బస్సు సౌకర్యం అందుబాటులో లేకపోతే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇందుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని గిరిజనులు వాపోతున్నారు.

కొన్ని ప్రాంతాల్లో రహదారులు కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం మరింత కష్టసాధ్యంగా మారుతోంది.

**పోలవరం ప్రభావిత, పునరావాస గ్రామాలకు కొత్త దారి?**

దేవీపట్నం, విలీన మండలాలు, పోలవరం ప్రాజెక్టు ప్రభావిత మరియు పునరావాస ప్రాంతాల ప్రజలకు కూడా రవాణా సౌకర్యం ప్రధాన సమస్యగా ఉంది.జిల్లా కేంద్రానికి, ప్రభుత్వ కార్యాలయాలకు, ఆసుపత్రులకు, ఉపాధి అవకాశాల కోసం ప్రయాణించాల్సిన ప్రజలు సరైన ప్రజా రవాణా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రంపచోడవరంలో పూర్తి స్థాయి డిపో ఏర్పడితే ఈ ప్రాంతాలకు కొత్త బస్సు సర్వీసులు అందుబాటులోకి రావడంతో పాటు ప్రజల ప్రయాణ కష్టాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**"బస్సు వస్తే రోడ్డు వస్తుంది... రోడ్డు వస్తేనే మా జీవితం మారుతుంది"**

ఏజెన్సీ గిరిజనుల మాటల్లో రవాణా సమస్య వెనుక ఒక పెద్ద వాస్తవం దాగి ఉంది."మా ఊరికి బస్సు రావాలంటే రోడ్డు కావాలి... బస్సు నడవడం ప్రారంభమైతే రోడ్డు నిర్వహణ కూడా జరుగుతుంది... రోడ్డు వస్తేనే మా జీవితం మారుతుంది" అని వారు అంటున్నారు.ఆర్టీసీ బస్సులు నడవాలంటే రహదారులు సురక్షితంగా, ప్రయాణానికి అనుకూలంగా ఉండాల్సిందే. దీంతో కొత్త బస్సు సర్వీసుల అవసరం రహదారుల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని గిరిజనులు భావిస్తున్నారు.

అందుకే వారి దృష్టిలో రంపచోడవరం డిపో కేవలం బస్సులు నిలిపే స్థలం కాదు...రోడ్లకు దారి... వైద్యానికి దారి... విద్యకు దారి... ఉపాధికి దారి!

**30 బస్సుల సామర్థ్యం... బ్లూప్రింట్ సిద్ధమవుతుందా?**

పూర్తిస్థాయి ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలంటే కనీసం 30 బస్సులు నిలిపి నిర్వహించగల సామర్థ్యం అవసరమని తెలుస్తోంది. బస్సుల పార్కింగ్, మరమ్మతుల కేంద్రం, కార్యాలయ భవనాలు, సిబ్బంది వసతి, ఇంధన సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కోసం విస్తృత ప్రణాళిక అవసరం.

ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన అధికారులు ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సమగ్ర బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నారా? డిపోకు అవసరమైన ప్రభుత్వ భూమిని గుర్తించారా? ఆర్థిక భారం, మౌలిక వసతులపై అంచనాలు రూపొందించారా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. బ్లూప్రింట్ సిద్ధమైతే ప్రభుత్వ ఆమోదాలు, నిధుల కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతాయనేది కీలకం కానుంది.

**సర్వే కాదు... శాశ్వత పరిష్కారం కావాలి!**

రంపచోడవరం ఏజెన్సీ ప్రజలు ఇప్పుడు మరో సర్వే, మరో నివేదిక కోసం ఎదురుచూడడం లేదు.

"మా దశాబ్దాల రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలి"

**అనేదే వారి డిమాండ్.**

విజయవాడ నుంచి వచ్చిన ఎండీ కార్యాలయ సాంకేతిక బృందం క్షేత్రస్థాయి పరిశీలన ఏజెన్సీ ప్రాంతాల్లో ఆశల దీపం వెలిగించింది. కానీ ఇప్పుడు ప్రజలు ఎదురుచూస్తున్నది నివేదిక కోసం కాదు...

**డిపో మంజూరు కోసం!**

ఆశలు ఫైళ్లలోనే పరిమితమవుతాయా?

లేక రంపచోడవరం గడ్డపై నిజంగానే ఎర్రబస్సుల కొత్త డిపో రూపుదిద్దుకుంటుందా?అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

**రంపచోడవరం డిపో... కేవలం బస్సుల కోసం కాదు!**

ఏజెన్సీ గిరిజనుల భవిష్యత్తు కోసం...

12 మండలాల ప్రయాణ భద్రత కోసం...

వైద్యం, విద్య, ఉపాధి, అభివృద్ధికి కొత్త దారి కోసం...

ఇప్పుడు సర్వేలకు ముగింపు పలికి... డిపోకు పునాది వేయాల్సిన సమయం వచ్చిందని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన

## ప.గో జిల్లా క్రీడాకారులు పతక విజేతలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందనలు.




**పెనుమంట్ర పెన్ పవర్ సెప్టెంబర్ 8:**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా నుంచి పాల్గొని పలు పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్. సమావేశ మందిరంలో అభినందించారు. విజేతల మెడలో పతకాలు వేసి, వారి ప్రతిభను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు పశ్చిమగోదావరి జిల్లాకు గర్వకారణమని అన్నారు. యోగా అండర్--23 విభాగంలో ఐ. అర్మిత భవాని చౌదరి వెండి పతకం సాధించారని తెలిపారు. ఆర్చరీ అండర్--17 విభాగంలో కె. హేమశ్రీ బంగారు పతకం సాధించగా, జట్టు విభాగంలో కనిష్క, శ్రద్ధ లు కూడా బంగారు పతకాలు సాధించారని వివరించారు. షటిల్ బ్యాడ్మింటన్ అండర్--17 విభాగంలో ఎస్. హేమంత్ శ్రీ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించారని, సి.హెచ్. విజయ చరణ్ సింగిల్స్ విభాగంలో బంగారు పతకం సాధించారని జిల్లా కలెక్టర్ తెలిపారు. బాక్సింగ్ అండర్--17 విభాగంలో బి. నదియా 70--75 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించగా, కె. శరణ్య 44--46 కేజీల విభాగంలో వెండి పతకం సాధించారని వివరించారు.క్రీడాకారులు సాధించిన విజయాలు ఇతర విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావడానికి క్రీడాకారులు కృషి చేయాలని ఆమె అన్నారు. జిల్లాలో క్రీడా ప్రతిభను మరింతగా వెలికితీసేందుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహించడం, వారికి మెరుగైన శిక్షణా అవకాశాలు కల్పించడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు తమ విజయ పరంపరను కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ కె కల్పశ్రీ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో విజయం సాధించేందుకు ప్రతిభతో పాటు నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని అన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు తమ విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె తెలిపారు. క్రీడాకారులకు తల్లిదండ్రులు, కోచ్‌లు, పీఈటీలు అందిస్తున్న ప్రోత్సాహం, మార్గదర్శనం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి ఎన్. మోహన్ దాస్ తో పాటు, పీఈటీలు, పీడీలు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# 'కాకినాడ క్రౌన్' రన్నర్ గా నిలిచిన మార్టేరు విద్యార్ధిని.





**పెనుమంట్ర పెన్ పవర్ సెప్టెంబర్ 08 :** సోమవారం కాకినాడ లో నిర్వహించిన క్రౌన్ ఆఫ్ కాకినాడ లో మార్టేరు విద్యార్థిని దిద్దే మౌనిక రన్నర్ గా విజయం సాధించింది. మార్టేరులో ఎస్ఎం బ్యూటీపార్లర్ విద్యార్థిని మౌనిక కాకినాడలో మేకప్ ఆర్టిస్ట్ ల విభాగంలో సినీ డైరెక్టర్ సతీష్ అడ్డాల డీ కన్వెన్షన్ లో నిర్వహించిన ఈ పోటీల్లో 50 మంది పాల్గొనగా మౌనిక విశేషం ప్రతిభ తో ఫస్ట్ రన్నర్ అప్ గా విజయం సాధించింది. విజేతను మంగళ వారం మార్టేరులోని ఇనిస్టిట్యూషన్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ పి. నాగరత్నాలక్షీ మాట్లాడుతూ మా ఇనిస్టిట్యూట్ నుండి శిక్షణ పొంది గెలుపొందడం గర్వకారణంగా ఉంది అన్నారు. భవిష్యత్తులో ఏపీ స్థాయిలో మౌనిక మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మౌనిక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం అయిన జగన్నాధపురం నుండి మార్టేరు వచ్చి మేకప్ విద్యను డైరెక్టర్ నాగరత్నాలక్షీ ప్రోత్సహంతో నేర్చుకున్నానన్నారు.

# మట్టిలో మాణిక్యం.. నీట్‌లో మెరిసిన పేదింటి బిడ్డ.

- పేదరికం అడ్డుకాలేదు.. పట్టుదల గెలిచింది
- కష్టాల మధ్య చదువు.. వైద్య విద్యలో అడుగు



**పెనుమంట్ర పెన్ పవర్ సెప్టెంబర్ : 08 :**పేదరికం చదువుకు అడ్డంకి కాదని నిరూపిస్తూ పెనుమంట్ర మండలం వెలగలేరు గ్రామానికి చెందిన సిర్రా అనూరాధ నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించింది.రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించే అవకాశం దక్కించుకుంది.అనూరాధ తల్లిదండ్రులు సిర్రా నాగేశ్వరరావు, జ్యోతి సాధారణ టైలర్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కుమార్తె చదువుకు వారు ఎలాంటి లోటురానివ్వలేదు పెద్ద కుమార్తె సిర్రా శాంతి స్వరూప డిగ్రీ బీఎస్సీ చదువుతోంది.తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకున్న అనూరాధ లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివింది. నీట్‌లో ఉత్తీర్ణత సాధించి, ప్రతిష్ఠాత్మక వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించింది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె సాధించిన విజయం గ్రామంలో హర్షం నింపింది.పట్టుదల, కృషి ఉంటే పేదరికాన్ని అధిగమించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అనూరాధ నిరూపించిందని గ్రామస్థులుఅభినందించారు భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

# గిడుగు రామమూర్తి పంతులు కీర్తి పురస్కారాన్ని అందుకున్న డా జొన్నకూటి



**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**వ్యవహారిక భాషా ఉద్యమంతో తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేసిన మహనీయులు గిడుగు రామమూర్తి పంతులు, వారి పేరున ఏర్పాటు చేసిన జాతీయ అవార్డును మండలంలోని పైడిమెట్ట గ్రామానికి చెందిన కవి, రచయిత, జర్నలిస్ట్, ఉపాధ్యాయుడు, సామాజిక వేత్త డా జొన్నకూటి ప్రమోద్ కుమార్ అందుకున్నారు. పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నగరంలో ధర్మం చర కమ్యూనిటీ హాల్ వేదికపై జరిగిన తెలుగు భాషా దినోత్సవం, టీచర్స్ డే వేడుకలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ జె.డి.ఎస్ అబ్రహం, ఎస్.పి నరసింహమూర్తి, శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ల చేతుల మీదుగా అయన ఈ అవార్డు అందుకున్నారు. తన కవితలు, రచనల ద్వారా సామాజిక సేవ చేస్తున్న డా.ప్రమోద్ తెలుగు సాహిత్య వికాసానికి దోహదపడే మరిన్ని రచనలు చేయాలని పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ఫౌండర్ డా.అద్దంకి రాజా యోనా అన్నారు. కార్యక్రమం లో 14 మంది కవులకు, ఉపాధ్యాయులకు ఈ పురస్కారాలను అందచేశారు.

# 9,10,11 తేదీల్లో అణుశక్తి విజ్ఞాన ప్రదర్శన



**రాజమహేంద్రవరం పెన్ పవర్ సెప్టెంబర్ 8:** ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో, భారత అణుశక్తి విభాగానికి చెందిన ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ కల్పక్కం సహకారంతో రాజానగరం లోని ప్రాంగణంలో సెప్టెంబర్ 9, 10, 11 తేదీల్లో అణుశక్తి విజ్ఞాన ప్రదర్శన నిర్వహించనున్నారు.

అణుశక్తి శాంతియుత వినియోగాలు, ఆధునిక అణు సాంకేతిక పరిజ్ఞానం, భారతదేశ అణుశక్తి కార్యక్రమాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

ప్రదర్శనలో అణుశక్తి ఉత్పత్తి విధానం, అణు రియాక్టర్ల పనితీరు, రేడియేషన్ సాంకేతికతతో పాటు వైద్యం,వ్యవసాయం, ఆహార పరిరక్షణ, ఇంధన భద్రత తదితర రంగాల్లో రేడియేషన్ శాంతియుత అనువర్తనాలను నమూ నాలు, శాస్త్రీయ చార్టులు, ఇంటరాక్టివ్ ప్రదర్శనల ద్వారా వివరించనున్నారు. భారతదేశ స్వదేశీ మూడు దశల అణు విద్యుత్ కార్యక్రమం, ఫాస్ట్ రియాక్టర్ సాంకేతికత వంటి కీలక అంశాలను కూడా సందర్శకులకు పరిచయం చేయనున్నారు.విద్యార్థులకు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా సంభాషించే అవకాశం కల్పించడంతో పాటు అణుశక్తి, రేడియేషన్ భద్రత, ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేయనున్నారు. ఈ ప్రదర్శన విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడంతో పాటు దేశ శాస్త్రీయ, సాంకేతిక అభివృద్ధిపై అవగాహన కల్పించడంలో దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రదర్శనకు సంబంధించిన గోడ పత్రికను వైస్ ఛాన్సలర్ డా. యు. చంద్రశేఖర్, ప్రో–వైస్ ఛాన్సలర్ డా. కె. భాస్కర్ రాజు, డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) డా. ఎం. శ్రీనివాసరావు, డైరెక్టర్ (ఇన్నోవేషన్) డా. వై. మురళీధర్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. నిర్మలా దేవి, హెడ్ జలజ మదన్ మోహన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. పి. శ్రీనివాసరావు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డైరెక్టర్ కె. ఇందుధరరావు, అడ్వైజరీ సభ్యుడు డా. నరేంద్రబాబు తదితరులు మంగళవారం గెయిట్ ఆవిష్కరించారు. సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ద్వారా తూర్పుగోదావరి ప్రాంత విద్యార్థులు, ఉపాధ్యా యులు, ప్రజలకు అణుశక్తి శాంతియుత వినియోగాలు, ఆధునిక అణు సాంకేతిక తపై సమగ్ర అవగాహన పొందే అవకాశం లభించనుంది."శాస్త్ర విజ్ఞానం ప్రజలకు -- సాంకేతికత దేశ అభివృద్ధికి" అనే లక్ష్యంతో ఈ విజ్ఞాన ప్రదర్శనను నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# వినాయక చవితి ఉత్సవాలకు డీజేలు నిషేధం..




- సింగిల్ విండో పోర్టల్ ద్వారా ఉచితంగా అనుమతులు --
- పెనుగొండ సబ్ ఇన్స్పెక్టర్ కె.గంగాధరరావు

**పెనుగొండ పెన్ పవర్ సెప్టెంబర్ :08:**పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుగొండ సర్కిల్ పరిధిలోని పెనుగొండ గ్రామాలలో రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని, డీజేల నుంచి వెలువడే అధిక శబ్దం వల్ల గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ప్రమాదం ఉన్నందున డీజేలను నిషేధిస్తున్నట్లు పెనుగొండ సబ్ ఇన్స్పెక్టర్ కొప్పిశెట్టి గంగాధర్ స్పష్టం చేశారు.

గణేష్ ఉత్సవాల అనుమతులను సులభంగా పొందేందుకు ఆంధ్రప్రదేశ్ డీజీపీ సూచనల మేరకు గణేష్ ఉత్సవ్ సింగిల్ విండో పోర్టల్(www.ganeshutsav.net) ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గతంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీస్, అగ్నిమాపక, గ్రామ పంచాయతీ/మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతుల కోసం వేర్వేరు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఈ ప్రక్రియను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు....సింగిల్ విండో పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం, స్థల పరిశీలన, నిరభ్యంతర పత్రం (ఎన్.ఓ.సి) పొందడం పూర్తిగా ఉచితమని సబ్ ఇన్స్పెక్టర్ కె.గంగాధర్ తెలిపారు. ఎలాంటి రుసుము లేదా చలానా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నిర్వాహకులు వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ అనంతరం కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే స్థలం, విగ్రహం ఎత్తు, ఉత్సవాల తేదీలు, నిమజ్జనం రూట్ తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు.స్థల పరిశీలన అనంతరం డిజిటల్.... ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించిన అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో కూడిన బృందం మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తుందని తెలిపారు. భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ ఎన్ఓసి మంజూరు చేస్తారని చెప్పారు. ఆ ఎన్ఓసిను డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసి లామినేషన్ చేయించి మండపంలో స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలన్నారు.

**మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి......**

మండపాలు రహదారులపై రాకపోకలకు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా ఏర్పాటు చేయాలని ఎస్సై సూచించారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లు, నీటి డ్రమ్ములు వంటి పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు.

నిమజ్జనం, ఊరేగింపు సమయంలో పబ్లిక్ సౌండ్ సిస్టమ్స్‌ను నిర్ణీత పరిమితుల్లో మాత్రమే వినియోగించాలని, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజేలకుఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు.అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసినా, నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెనుగొండ సబ్ ఇన్స్పెక్టర్ కొప్పిశెట్టి గంగాధరరావు ప్రభుత్వ హెచ్చరించరికలు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు .

# దళారులను నమ్మవద్దు...

**కళా జాతర ద్వారా నిర్వాసిత ప్రజలకు అవగాహన**




**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్8.** పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు చెల్లిస్తున్న పరిహారం సొమ్మును సురక్షితంగా వినియో గించుకునేందుకు చింతూరు ఐటీడీ ఏ పీవో శుభంకల్ ఆధ్వర్యంలో కళా జాతర ద్వారా అవగాహన శిబిరాలు నిర్వహించారు.విభూతి బ్రదర్స్ రాజమహేం ద్రవరం కళాకారులు టేకులబోరు, కూనవరం బస్టాండ్ సెంటర్ నందు దళారుల నుండి మోస పోకుండా అప్రమత్తంగా ఎలా ఉండాలని కళ జాతర ద్వారా అవగాహన కల్పిం చారు.వారి కళ ద్వారా డబ్బు నిర్వహణ,పొదుపు,సురక్షిత పెట్టుబడులపై,తొందరపడి ఇతరులను నమ్మి డబ్బు ఎవరికీ ఇవ్వవద్దని,కుటుంబ భవిష్యత్ కోసం పొదుపు ఎలా చేసుకోవాలో జాతర ద్వారా నిర్వాసిత ప్రజలకు అవగాహన కల్పిస్తూ హెచ్చరించా రు.ఈ కార్యక్రమంలో నిర్వాసిత ప్రజలు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజంలో సంపూర్ణ అక్షరాస్యత సాధ్యం

- వయోజన విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి పోశయ్య



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అర్బన్ పరిధిలోని లాలాచెరువు హైస్కూల్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అక్షరాస్యత ప్రాధాన్యత, విద్యతో వ్యక్తి, కుటుంబం, సమాజంలో మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అక్షరాస్యత, విద్య ప్రాధాన్యత, సమాజ అభివృద్ధి, బాధ్యతాయుత పౌరసత్వం వంటి అంశాలపై ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి పసుపులేటి పోశయ్య మాట్లాడుతూ , అక్షరాస్యత కేవలం చదవడం, రాయడం మాత్రమే కాకుండా సమాచారాన్ని అర్థం చేసుకుని, రోజువారీ జీవితంలో సమర్థవంతంగా వినియోగించుకునే సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులోకి వచ్చినప్పుడే సమాజంలో సామాజిక, ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. సాంకేతిక యుగంలో అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్య అవగాహన అవసరమని, చదువుకు దూరంగా ఉన్న వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ కార్యక్రమాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా చదువుకు దూరంగా ఉన్న వయోజనులకు ప్రాథమిక విద్యా నైపుణ్యాలు అందించడంతో పాటు వారి సామాజిక, ఆర్థిక సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అక్షరాస్యత ఉద్యమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి. మహల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమణ, సూర్యనారాయణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ విధానాలకు ఆకర్షితులై బిజెపిలో చేరిన బాక్స్ ప్రసాదు

- ఎంపీ,ఎమ్మెల్సీ ,అనుచరులతో భారీ ర్యాలీ
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సమక్షంలో పార్టీలో చేరిన బాక్స్ ప్రసాదు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**గత 25 సంవత్సరాలుగా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ, ప్రధాన మంత్రిగా దేశ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మోడీ విధానాలకు ఆకర్షితులై బిజెపి పార్టీలో చేరానని మాజీ డిప్యూటీ మేయర్ బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాదు (బాక్స్ ప్రసాద్) తెలిపారు.

బిజెపి జిల్లా శాఖ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం మన ఊరు మన జెండా పేరుతో 100 జండాల పండగ జండాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాదు అల్కట్ గార్డెన్స్ తన ఇంటి వద్ద ఎమ్మెల్సీ సోము వీర్రాజు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు లతో కలిసి పెద్ద ఎత్తున యువత, ఆటో కార్మికులు, అనుచరులతో భారీ ర్యాలీగా కంబాల చెరువు వద్ద జరిగిన బహిరంగ సభలో బిజెపి పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రసాదును కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగామీడియాతో బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ 2025 లో ఆర్ఎస్ఎస్ శతవసంతాల వేడుకలు సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆహ్వానం మేరకు జరిగిన మహాసభల్లో తాను పాల్గొన్నన్నారు. భారతదేశ సంస్కృతి, సాంప్రదా యాలకు, ప్రజల సంక్షేమా నికి, అభివృద్ధికి ఆర్ఎస్ ఎస్ విధానాలు సరిపోతా యని భావించి బిజెపి లో చేరేందుకు నిర్ణయించు కున్నట్లు తెలిపారు. 1983 లో ఎన్టీ రామారావు అభిమానిగా ఉంటూ, 1995 లో తెలుగుదేశం పార్టీ లో చేరిన నాటినుంచి 2024 వరకు పార్టీ పదవులతో పాటు, 2009- 2014 వరకు డిప్యూటీ మేయారుగా ప్రజాసేవ చేసినట్టు తెలిపారు. సుమారు పది సంవత్సరా లు పాటు కొన్ని అనివార్య కారణాలవల్ల రాజకీయా లకు దూరంగా ఉన్నాన న్నారు. గత 12 సంవత్సరా లుగా ప్రధాని మోడీ దేశ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న విధానాలకు ఆకర్షితులై ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎంపీ పురంద రైశ్వరి సమక్షంలో బిజెపిలో చేరినట్లు తెలిపారు. తనకు పదవులు ముఖ్యం కాదని, బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమానికి ప్రజా సేవ చేయాలన్నదే లక్ష్యమని , తన లక్ష్యం నెరవేరే పార్టీ బిజెపిని తలచి ఆ పార్టీలో చేరానన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు,సుబ్రహ్మణ్యం, సతీష్, శ్రీనివాసరావు , వెంకటేష్ , కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉల్లాస్--అక్షర ఆంధ్రా చదువుతోనే సమాజంలో మార్పు





- 2029 నాటికి రాష్ట్రంలో నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యం
- అక్షర ఆంధ్రా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ కె. దినేష్‌కుమార్

**గంగవరం/ దేవీపట్నం, పెన్ పవర్ సెప్టెంబర్ 8:** చదువు ద్వారా వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాల్లో గణనీయమైన మార్పు సాధ్యమవుతుందని, 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవీపట్నం మండలం కొండమొదలు ఆర్అర్ కాలనీలో మంగళవారం అక్షర ఆంధ్రా అక్షరాస్యత కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్షరాస్యత కేంద్రంలో వయోజనులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. చదువు ప్రాధాన్యతతో పాటు అక్షరాస్యత వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా కలిగే ప్రయోజనాలను వివరించారు. చదువు ద్వారా ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ సేవలు, ప్రయాణాలు, డిజిటల్ సేవలు తదితరాలను సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అక్షరాస్యత కార్యక్రమం ద్వారా తమ జీవితాల్లో వచ్చిన మార్పును అభ్యసకులు వివరించినట్లు బోధకులు తెలిపారు. గతంలో తాము ఎక్కే బస్సు ఏ ఊరికి వెళ్తుందో కూడా తెలియని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం బస్సుపై రాసిన వివరాలను చదివి గమ్యస్థానాన్ని తెలుసుకోగలుగుతున్నామని అభ్యసకులు తెలిపినట్లు పేర్కొన్నారు. అక్షరాస్యతతో వారిలో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. పోలవరం జిల్లాలో తొలి దశలో అడ్డతీగల, చింతూరు, రాజవొమ్మంగి, రంపచోడవరం, వై.రామవరం మండలాల్లో 41,875 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. 4,222 మంది వాలంటీర్ టీచర్లతో కార్యక్రమాన్ని అమలు చేయగా, మార్చి 15, 2026న నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్షకు 40,812 మంది హాజరయ్యారని, వారిలో 38,392 మంది అంటే 94.07 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. 2026--27 సంవత్సరంలో రెండో దశలో దేవీపట్నం, గంగవరం, మారేడుమిల్లి, చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఏటపాక మండలాల్లో 30,563 మంది అభ్యసకులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 8 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైందని, వాలంటీర్ టీచర్లు, అభ్యసకుల నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల మహిళలు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాల అక్షరాస్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు అభ్యసకులకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వీరందరికీ మార్చి 2027లో ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ ఆర్అర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లు, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా సహాయ సంచాలకులు, అక్షర ఆంధ్రా నోడల్ అధికారి వి. త్రిమూర్తులు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి. రత్నాకర్‌రావు, దేవీపట్నం ఎంపీడీవో రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, అభ్యసకులు పాల్గొన్నారు.

## లక్ష్యాల సాధనలో వెనుకబడిన శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలి

### పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 8**: పోలవరం జిల్లాలోని 12 మండలాల్లో వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనితీరును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్‌తో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా రూపొందించిన నెలవారీ సూచికల ఆధారంగా శాఖల పనితీరును సమీక్షించి, తక్కువ స్కోరు నమోదైన శాఖలు లోటుపాట్లను సరిదిద్దుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో విద్యుత్ సమస్యలు లేకుండా అవసరమైతే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారులు వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతి మండలంలో డెస్క్‌టాప్ సదుపాయం ఏర్పాటు చేసి అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో డేటా ఎంట్రీ చేయాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఈ-క్రాప్ బుకింగ్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వరి, కూరగాయల సాగు విస్తీర్ణం, ఆయిల్ పామ్ తోటల విస్తరణ, సెరికల్చర్ సాగు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంజూరైన గృహాలను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో శిశు మరణాలు సంభవించకుండా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి అవసరమైన ఉచిత మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన విద్యార్థులకు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ మంజూరు కోసం సకాలంలో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలు, గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నాయా అనే అంశంపై సమీక్షించారు. పీ-4 కార్యక్రమం, రబ్బర్ ప్రాసెసింగ్ యూనిట్ల పనితీరుపైనా ఆరా తీశారు. క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 9, 10 తేదీల్లో అమరావతిలో కలెక్టర్ల సదస్సు జరగనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో అందుబాటులో ఉండాలని సూచించారు. 12 మండలాలకు సంబంధించిన శాఖల అధికారులతో కొందరిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, మరికొందరిని ప్రత్యక్షంగా సమావేశంలో సమీక్షించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, రంపచోడవరం ఆర్డీవో కె. స్వాతి పాల్గొన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మొహమ్మద్ షరీఫ్, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ రత్నాకర్ రావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ఉమా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ రావు, ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్‌వో నరేంద్ర కుమార్, సీపీఓ వెంకట్రావు, డాక్టర్ నీలిమ, జిల్లా రవాణా అధికారి రాజేష్ కుమార్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీపీడీసీఎల్ ఈఈ అచ్చుతారావు, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి త్రిమూర్తులు, డీఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పోటీకి సిద్ధం కావాలి





**మన ఊరు మన జెండా బహిరంగ సభలో పార్టీ అధ్యక్షుడు మాధవ్ పిలుపు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**జిల్లాలో ప్రతి గ్రామం లోనూ, వార్డుల్లోనూ బిజెపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం పాటు పడాలని, వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సంసిద్ధంగా ఉండాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీ ఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మన ఊరు మన జెండా పేరుతో 100 జండాల పండుగ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కంబాల చెరువు జంక్షన్ వద్ద జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షత న బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పి వి ఎన్ మాధవ్ మాట్లాడుతూ, కేంద్రంలో, రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ ఉండడం వల్ల రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం శరవేగంగా జరుగుతుందన్నారు. ఎన్నో కేంద్ర ప్రభుత్వ పథకాలకు వేల కోట్లు నిధులు ఇస్తూ అమలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పార్టీ క్యాడర్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. పార్టీ జెండా అంటే సాధారణం కాదని దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అన్నారు. స్వాతంత్రానంతరం త్యాగాలు చేసిన పార్టీ ప్రముఖులను గుర్తుంచు కోవాలని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవ చేయాలని అన్నారు. వారి బాటలోనే ప్రస్తుత ప్రధాని మోడీ కాశ్మీరుకున్న ప్రత్యేక హోదాను రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రపంచ మంతా విపత్కర పరిస్థితులు ఉన్నా , భారతదేశంలో 7.8 శాతం వృద్ధి రేటు కొనసాగడం మోడీ ఘనత అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దేశంలో మౌలిక వసతుల అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఎంపీ పురందరేశ్వరి మాట్లాడుతూ జెండాల పండగ కార్యక్రమం స్ఫూర్తిగా తీసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజా సేవలో బాధ్యత గల బాక్స్ ప్రసాద్ వంటి ప్రజాసేవకులు పార్టీలో చేరడం అభినంద నీయమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, నిజమైన ప్రజా సేవను బిజెపి మాత్రమే చేస్తుందని మిగతా పార్టీలకు దోచుకోవడం మాత్రమే తెలుసున్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లోను ఇదే స్ఫూర్తితో పార్టీ క్యాడర్ పనిచేయాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే, పార్టీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మోడీ సహకారంతో రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, అమరావతి ప్రాజెక్టు, విమానాశ్రయాలు, ఓడరేవులు, రోడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతున్నాయని వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, మట్టా ప్రసాదు, ఆకుల శ్రీధర్, మద్దిపాటి రజినీ, బాక్స్ ప్రసాదు, ఆర్ శ్రీను, కె హారిక యానాపు యేసు, అడబాల రామకృష్ణ, వీరాంజనే యులు, కే శ్రీనివాసరావు, రేలంగి శ్రీదేవి , నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రంప ఎర్రంపాలెంలో జనన మరణ రికార్డులు మాయం







- జిల్లా కలెక్టర్ జోక్యం చేసు కుని చర్యలు తీసుకోవాలి.
- మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షులు బత్తిన రామకృష్ణ డిమాండ్.

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 08:**–తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో పంచాయతీలలో ఒకటైన రంప ఎర్రంపాలెంలో ఘోరమైన నిర్లక్ష్యంతో రికార్డుల మాయం వెలుగుచూసింది. దాదాపు 8,000 మంది జనాభా, 1,974 కుటుంబాలు, 13.6 చ.కి.మీ విస్తీర్ణం కలిగిన ఈ గ్రామ పంచాయతీలో 2012 సంవత్సరం ముందు నాటి జనన–మరణ రిజిస్టర్లు లేవని అంటున్నారు తాజా కార్యదర్శి షకీలా. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షులు గ్రామానికి చెందిన ఒక దళిత నాయకుడు సామాజికవేత్త బత్తిన రామకృష్ణ సమాచార హక్కు చట్ట ప్రకారం కోరిన సమాచారానికి బదులుగా రికార్డులు కనిపించడం లేదనే సమాధానంగా వచ్చింది. దీనికి సంబంధించి జనన మరణ రిజిస్టర్లు తనకి నిమిత్తం దరఖాస్తు చేయగా రికార్డులు మాయమైనట్లు ముందుగా గ్రహించి ఉండొచ్చేమో అని రికార్డులు చూపించడానికి ఒకంత ఆలస్యం చేసి నిర్ణీత సమయం దాటిన తర్వాత రికార్డులు తనిఖీ కనుమతించారు అయితే ఇది పూర్తిగా సమాచార హక్కు చట్టానికి విరోధం అని అప్పిలికి వెళ్లడంతో ఆపిల్ అధికారి ఆదేశాలు మేరకు ఈ నెల ఐదో తేదీన గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనకి నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీ నిర్వహించిన సమయంలో 2008 నుండి 2022 వరకు జనన మరణ రికార్డులు తనిఖీ చేయాలని కోరడంతో 2012కు ముందు జనన మరణ రికార్డులు లేవంటూ కార్యదర్శి 2012 నుండి రికార్డులు చూపించడంతో రికార్డులు మాయం అయిన సంగతి బయటకు వచ్చింది. అసలు ఎందుకు అలా జరిగింది? ఏమయ్యాయి దీనిమీద మీరు ఈ విధమైన చర్యలు తీసుకోకుండా చార్జలా తీసుకున్నారు అంటే గతంలో ఇక్కడ పనిచేసే కార్యదర్శి నాకు రికార్డులు అప్పగించలేదని చెప్పడం నిర్లక్ష్యంగా కనిపించింది దీనిపై జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

**రికార్డులు మాయం అవడం ఏంటి గ్రామస్తులు ఆందోళన....????**

రంప ఎర్రం పాలెం గ్రామపంచాయతీలో జనన మరణ ధ్రువీకరణ రిజిస్టర్లు మాయం అవడం పట్ల గ్రామంలో కలకలం రేగింది. ఎందుకంటే 2011 జనాభా లెక్కల ప్రకారమే ఈ గ్రామ జనాభా 6,961 మంది. నేటి అంచనా ప్రకారం 8,500 మందికి పైగా ఉన్నారు. అంటే 2012 ముందు పుట్టిన కనీసం 5,000 మంది ప్రజల జనన రికార్డులు లేనట్టే. వారికి కుల ధృవీకరణ, ఆస్తి హక్కులు, వారసత్వం, పింఛన్లు, ప్రభుత్వ పథకాలకు ఆధారమే లేకుండా పోయింది.

**బాధ్యతా రహితంగా కార్యదర్శి వ్యవహారం..!!!!**

ఈ విషయంపై మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బత్తిన వీర వెంకట రామకృష్ణ పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. “పూర్తి రికార్డులు లేకుండా మీరు చార్జ్ ఎలా తీసుకున్నారు?” అని ప్రశ్నించగా, “రికార్డులు నాకు అప్పగించలేదు, ఏమయ్యాయో నాకు తెలియదు, అయినా చార్జ్ తీసుకున్నాను” అని ఆమె బాధ్యతా రహితంగా సమాధానం ఇచ్చారని ఆయన తెలిపారు.

**ఇది పచ్చి నిర్లక్ష్యం,చట్టవిరుద్ధం..!!!**

పంచాయతీ నిబంధనల ప్రకారం ప్రతి రికార్డును లెక్కబెట్టి, హ్యాండింగ్ ఓవర్ సర్టిఫికెట్ పై సంతకం పెట్టాలి. 13.6 చ.కి.మీ విస్తీర్ణం, 2,000 కుటుంబాల కీలక రిజిస్టర్లు మాయం కావడం వెనుక భారీ కుట్ర ఉంది. భూ కబ్జాల కోసం, నకిలీ జనన సర్టిఫికెట్ల కోసం, అవినీతిని కప్పి పుచ్చడానికి ఈ రికార్డులను కావాలనే మాయం చేశారా అనే అనుమానం కలుగుతోంది” అని బత్తిన రామకృష్ణ ఆరోపించారు. రంప యర్రం పాలెం గ్రామ పంచాయతీలో రికార్డులు మాయం పట్ల తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి వెంటనే స్పందించి, గత 20 ఏళ్లలో పనిచేసిన కార్యదర్శులందరినీ విచారించి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని. గ్రామ ప్రజలు ఇబ్బంది పడకుండా, మండల పరిషత్, పీహెచ్సి, స్కూల్ రికార్డుల ఆధారంగా జనన–మరణ రికార్డులను తిరిగి రాయాలని ఆయన కోరుతూ పంచాయతీ లలో ఆడిట్ చేసే అధికారులు నిద్ర పోతున్నారా లేక ఆడిట్ చేసినట్లు డబ్బులు దండుకుంటున్నారా అంటూ అడిట్ అధికారులను కూడా విచారించాలని.

**ఇదే అసలైన దేశద్రోహం...!!!!**

ప్రభుత్వ రికార్డు మాయం చేయడం దేశద్రోహంతో సమానం. 8,000 మంది ప్రజల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం నిద్రపోతుందా అని ఆయన అధికారులను ప్రశ్నించారు. వెంటనే సంబంధిత అధికారులు పోలీసు కేసు ఫైల్ చేసి రికార్డులు మాయం పట్ల సమగ్ర విచారణ కూడా చేపట్టి బాధ్యత కఠిన చర్యలు తీసుకోవాలని ఎప్పటినుంచి రికార్డు లేవు ఎవరు చార్జి తీసుకోలేదు అనే విషయాలపై గట్టిగా విచారణ చేపట్టి సంబంధిత కార్యదర్శులు పైన కూడా కేసులు నమోదు చేయాలని బత్తిన రామకృష్ణ డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం పట్ల మానవ హక్కుల కమిషన్ కి ఫిర్యాదు చేస్తానని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బతిన రామకృష్ణ జిల్లా అధికారులకు డిమాండ్ చేస్తున్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పారదర్శకతతో పరిష్కరించాలి

కమిషనర్ రాహుల్ మీనా




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పారదర్శకతతో పరిష్క రించాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. మంగళవారం ఏవీఏ రోడ్డు, జేఎన్ రోడ్డు, తారకరామ నగర్ సహా పలు ప్రాంతాలలో పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఇన్ ప్రిన్సిపుల్ లే అవుట్ ప్యాట్రన్ (ఐపిఎల్పీ)లను తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వయంగా పరిశీలించారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, లోపాలు లేదా అభ్యంతరాలు ఉంటే.. స్పష్టమైన వివరాలతో రిమార్క్స్ నోట్ చేసి తదుపరి అనుమతుల కోసం పంపాలని స్పష్టం చేశారు. దరఖాస్తులను క్రమబద్ధీకరించే క్రమంలో ‘ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్’ (ముందు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత) విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, జాప్యానికి తావు ఉండకూడదన్నారు. రోడ్డు విస్తరణల కోసం వదిలేసిన స్థలాలలో నిర్మాణాలు కానీ, ఆక్రమణలు కానీ లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట సిటీ ప్లానర్ జి.వి.ఎస్. ఎన్.మూర్తి, ఏసీపీ కొండలరావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

# సిగ్నల్ సమస్యతో పెన్షన్ దారుల దరఖాస్తులు నిలిచిపోతాయా...

-తక్షణం ఫైబర్ నెట్ ను ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు



**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్8.** మూడు సంవత్సరాలుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు,వికలాంగులకు ప్రభుత్వం కొత్తగా అవకాశం ఇచ్చింది.సెప్టెంబర్ 7నుండి16 వరకు ఆన్లైన్ దరఖాస్తులకు గడువు ఉంది.కూనవరం మేజర్ పంచాయ తీ కార్యాలయంలో నెట్ సిగ్నల్ లేక దరఖాస్తులు ఆగిపోతున్నాయి. ఫైబర్ నెట్ లేకపోవడంతో కంప్యూ టర్ సిబ్బంది సెల్ డేటాతో ఆన్లైన్ చేస్తున్నారు.ఫలితంగా మొదటి రోజు 2,రెండో రోజు 5దరఖాస్తులు మాత్రమే అయ్యాయి.పక్క మండ లాల్లో రోజుకు 35–40 దరఖాస్తులు అవుతుండగా,ఇక్కడ 4–5మాత్రమే ఆన్లైన్ అవుతున్నాయి.గడువు ఇంకా 8రోజులు మాత్రమే ఉండటం తో లబ్ధిదారులు ఆందోళన చెందు తున్నారు.తక్షణం ఫైబర్ నెట్ ఏర్పాటు చేసి అందరి దరఖాస్తులు తీసుకోవాలని పెన్షన్ దారులు అధికారులను కోరుతున్నారు.

## డెత్ సర్టిఫికెట్ కోసం పంచాయతీ చుట్టూ భర్త...

పంచాయతీ సెక్రెటరీ నిర్లక్ష్యం



**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్8.** భార్య మరణించిన దుఃఖంలో ఉన్న కుటుంబానికి డెత్ సర్టిఫికెట్ కోసం పంచాయతీ సెక్రెటరీ పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పించు కుంటున్నారని బాధితుడు తెలిపారు.కూనవరం మండలం మేజర్ పంచాయతీకి చెందిన వేములపల్లి రామారావు భార్య ఆగస్టు 27న మరణించిందని,డెత్ సర్టిఫికెట్ కోసం గత 10 రోజులుగా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని తెలిపారు. పంచాయతీకి వెళ్తే ఎంపీడీవో ఆఫీ సుకు వెళ్లమంటున్నారు.ఎంపీడీవో ఆఫీసుకు వెళ్తే మళ్లీ పంచాయతీకి వెళ్లమంటున్నారు.దీంతో విసిగిపో యిన బాధితుడు ఇస్తే ఇవ్వండి, లేకపోతే మానేయండి.నేను ఇంకా తిరగలేనని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యను కోల్పోయిన బాధలో ఉన్న తనను ఇలా తిప్ప డం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.


# వినాయక నిమజ్జనాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి



కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**వినాయక చవితి నిమజ్జనాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూవినాయక నిమజ్జనం శాంతియు తంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపు, రూట్ మ్యాపింగ్, విద్యుత్ వైర్లు సంబంధిత జాగ్రత్తలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏఏ తేదీలలో ఎన్ని విగ్రహాలు నిమజ్జనం చేస్తారో వివరాలు ముందుగానే సేకరించడం ద్వారా సదుపాయాలు కల్పించడం సులభతరం అవుతుందన్నారు. నిమజ్జనం జరిగే మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. గణేష్ విగ్రహాలను కేటాయించిన రూట్లలో మాత్రమే తరలించాలని పేర్కొన్నారు. మండపాలను ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకునేలా పర్యవేక్షించాలని , విద్యుత్ పోల్స్, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలని తెలిపారు. లైన్ మెన్లు అందుబాటులో ఉండాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రసాదాల పంపిణీకి ఎక్కడా ప్లాస్టిక్ ప్లేట్లను, గ్లాసులను వినియోగించకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద అగ్నిమాపక భద్రత చర్యలు తప్పనిసరిగా పాటించాలని, రాత్రి 10 గంటల తర్వాత మైక్ సెట్లు, డీజేలు పూర్తిగా నిషేధమని తెలియజేశారు. నిమజ్జనం పాయింట్ వద్ద ప్రస్తుతం ఉన్న లైన్లతో పాటు అదనంగా ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, నిమజ్జనం పాయింట్ వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలియజేశారు. సమీక్షలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, సీఐ(ట్రాఫిక్) నబి, త్రీ టౌన్ సీఐ వీఏ రావు, ఇతర మునిసిపల్ అధికారులు, పోలీస్, అగ్నిమాపక, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలి




- ఉత్తరాఖండ్ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ ఎస్సీ విభాగం డిమాండ్

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 08:** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు, ఏపీసీసీ అధ్యక్షులు షర్మిలారెడ్డి ఆదేశాలతో విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో గోకవరం గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా అధ్యక్షులు కొండా శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా శ్రీను మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాఖండ్‌లోని రామలీల మైదానంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు శుద్ధి చేయడం దళిత సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. అదే మైదానంలో ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఎలాంటి శుద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, దళిత వర్గానికి చెందిన మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన అనంతరం మాత్రమే ఇటువంటి చర్యలకు పాల్పడటం వివక్షకు నిదర్శనమని విమర్శించారు.ఈ ఘటనపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేయగా ఆయనపై కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమే నని కొండా శ్రీను అన్నారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఉత్తరాఖండ్‌లో మల్లికార్జున ఖర్గేను అవమానించేలా వ్యవహరించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ విజయవాడలో ధర్నా చేపట్టడం జరిగిందని ఆ ధర్నాలో ఆయన పాల్గొన్నారు అని తెలిపారు.

# జనసేన సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ముఖేష్ జన్మదిన వేడుకలు.

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్ సెప్టెంబర్ 08:**తాడేపల్లిగూడెం జనసేన సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బయనపాలెపు ముఖేష్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. అనంతరం తాడేపల్లిగూడెం పురదేవత శ్రీ బలుసులమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.అనంతరం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పాలు, పండ్లు పంపిణీ చేసి తన సేవా భావాన్ని చాటుకున్నారు. అనంతరం పెంటపాడు మండలం జనసేన పార్టీ కోఆర్డినేటర్ మరియు ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ కసిరెడ్డి మధులత దంపతులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కేశవభట్ల విజయ, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబి, తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాజులూరి దుర్గా మల్లేశ్వరరావు, తాడేపల్లిగూడెం విశాల సహకార పరపతి సంఘం డైరెక్టర్ బాబి, రుద్ర రమేష్, తామరాడ చిన్న, తాడేపల్లిగూడెం తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, కాళ్ళ గోపి, చామన సురేషు, షేక్ నబి, కేశవ, కన్నయ్య జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ బయనపాలెపు ముఖేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, సమాజ సేవ పట్ల బయనపలెపు ముఖేష్



అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజాసేవతో పాటు పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఉత్కృష్ట సేవా పథకం అందుకున్న కానిస్టేబుల్స్ శ్రావణ్






**తాడేపల్లిగూడెం.పెన్ పవర్. సెప్టెంబర్ 08:**పశ్చిమగోదావరి జిల్లాలో గడిచిన 15 సంవత్సరాలుగా మచ్చలేని వ్యక్తిత్వానికి, సేవ కు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ స్థాయి పురస్కారాన్ని తాళ్ల ముదునూరు పాడుకు చెందిన శ్రావణ్ కుమార్ అందుకున్నాడు. వివరాల్లోకి వెళితే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అందించే ప్రతిష్టాత్మకమైన ఉత్కృష్ట సేవా పథకం 2025 ను జిల్లా ఎస్పీ అధ్మాన్ నయీమ్ అస్మి ఐపీఎస్ చేతుల మీదగా శ్రావణ్ కుమార్ స్వీకరించాడు. శ్రావణ్ కుమార్ సత్తి శ్రావణ్ కుమార్ నరసాపురం టౌన్ తాడేపల్లిగూడెం ట్రాఫిక్ ఎలమంచిలి తాడేపల్లిగూడెం టౌన్ ప్రస్తుతం డిఎస్పీ ఆఫీస్ తాడేపల్లిగూడెం లో పని చేస్తున్నారు. అంకితభావంతో పనిచేసే యువతకు ప్రోత్సాహకంగా ఇచ్చిన ఈ సేవా పథకం ఎంతో మరపురానిదని, అందుకు సహకరించిన కుటుంబసభ్యులకు ఉన్నతాధికారులకు సహచార సిబ్బందికి శ్రావణ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే గతంలో వివిధ సేవ సంస్థల నుండి కూడా సేవా పురస్కారం అందుకున్నారు..ు

# అడ్డతీగల వారపు సంతలో పోలీసులు భారీ ర్యాలీ.. డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం..






**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 08;** మంగళవారం అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో వారపు సంతలో భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో ఆరోగ్యం ముద్దు బ్రో అన్న నినాదంతో ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ అనంతరం సిఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంపై కుటుంబాలు వీధిన పడతాయని మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉన్నది అని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ కి దూరంగా ఉండాలని గంజాయి వంటి మాదకద్రవ్యాలు జోలికి ఎవరు పోవద్దని వీటి వల్ల వచ్చే అనర్థాలు, అనారోగ్య కారణాలను ప్రజలకు వివరించారు. ఎస్సై వినోద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని డ్రగ్స్ జోలికి పోవద్దని గంజాయి వంటి వి పండించిన రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ తెలియజేశారు. అలానే గంజాయి ఎవరైనా పండించిన, రవాణా చేసిన అటువంటి వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని, తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్ఐ తెలిపారు. అలానే రోడ్డు భద్రత పాటించాలని ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని లేకుంటే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని, అంతేకాకుండా సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలని ఆయన తెలియజేశారు. అనంతరం స్థానిక దేవి గుడి సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం వీరికి వాలీబాల్ కిట్లను సీఐ గజేంద్ర కుమార్ మరియు ఎస్ఐ వినోద్ అందజేశారు.

# ఎన్వీఆర్ ఎమర్జెన్సీ కేర్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ ఫిజియో ꠰ స్పైన్ సెంటర్ ప్రారంభం





**✷ ఆధునిక ఫిజియోథెరపీ ꠰ పునరావాస చికిత్సలు**

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. సెప్టెంబర్ 08:**ఎన్వీఆర్ ఎమర్జెన్సీ కేర్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ ఫిజియో ꠰ స్పైన్ సెంటర్‌ను మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్ గవర్నర్ గట్టిశీ మాణిక్యాలరావు, పైబోయిన రఘు, దవులూరి దామోదర రావు. హాజరై తమ చేతుల మీదుగా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఫిజియోథెరపీ మరియు పునరావాస సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమని అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఈ నూతన అడ్వాన్స్‌డ్ ఫిజియో ꠰ స్పైన్ సెంటర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఎన్వీఆర్ ఎమర్జెన్సీ కేర్ హాస్పిటల్‌లోని అడ్వాన్స్‌డ్ ఫిజియో ꠰ స్పైన్ సెంటర్‌లో:**


లేజర్ టెక్నాలజీ ఫిజియోథెరపీ, రోబోటిక్ ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ ꠰ పునరావాస చికిత్సలు, ఆర్థోపెడిక్ ఫిజియోథెరపీ,, న్యూరో రీహాబిలిటేషన్, స్పోర్ట్స్ ఇంజరీ రీహాబిలిటేషన్,వంటి ఆధునిక సాంకేతికతతో కూడిన మెరుగైన ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉంటాయని చైర్మన్ నూకల బుల్లియ్య, సీఈఓ పడాల మధు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. నూకల దుర్గ, డా. అనూష గొల్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏరువాడకు రూ.10 కోట్ల అభివృద్ధి బాటలు









- ✷ గిరిజనుల కష్టాలు తెలుసుకున్న పవన్ కళ్యాణ్ రహదారి, తాగునీరు, పాఠశాల కోసం కీలక నిర్ణయం
- ✷ మృదుల మేడమ్ క్షేత్రస్థాయి పరిశీలన. ఉపాధ్యాయుడు సవలం రమేష్ సేవలకు ప్రశంసలు
- ✷ జనసేన చింతూరు మండల కమిటీ జనసైనికుల చొరవకు అభినందనలు

**చింతూరు, పెన్ పవర్,** పోలవరం జిల్లా చింతూరు మండలంలోని మారుమూల ఏరువాడ పీవీటీజీ గ్రామం అభివృద్ధికి కొత్త ఆశలు చిగురించాయి. కొండలు, వాగులు, వంకలు దాటుకుంటూ సుమారు 15 కిలోమీటర్లు కాలినడకన మాత్రమే చేరగలిగే ఏరువాడ గ్రామ ప్రజల సమస్యలను జనసేన నాయకులు ఉన్నతస్థాయికి తీసుకెళ్లారు. గ్రామంలోని పరిస్థితులను మృదుల మేడమ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీడియోలు, ఫోటోలు, క్లిప్పింగ్స్‌తో సహా సమస్యలను సంబంధిత పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి రహదారి లేకపోవడంతో విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేని పరిస్థితిని వివరించారు. ఏరువాడలో సుమారు 150 మంది జనాభా నివసిస్తుండగా, అక్కడి ప్రజలకు వెదురు బుట్టలు, చాటలు, కొండచీపుర్లు తయారీనే ప్రధాన జీవనాధారం. సెలయేర్ల నుంచి వచ్చే నీటినే తాగునీరు, ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నారనే విషయాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఐదు గంటల కాలినడకన పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయుడు గ్రామంలో పిల్లలకు విద్య అందించేందుకు సవలం రమేష్ ఎంతో అంకితభావంతో సేవలందిస్తున్నారు. చిడుమూరు గ్రామానికి చెందిన రమేష్ ఉపాధ్యాయుడిగా ఏరువాడలో విధులు నిర్వహిస్తూ, కొండలు వాగులు దాటుకుంటూ సుమారు 15 కిలోమీటర్లు ఐదు గంటల పాటు కాలినడకన ప్రయాణించి పాఠశాలకు చేరుకుంటున్నారు.

గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు ఉండగా, రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతులు తీవ్రంగా వెనుకబడ్డాయి. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాలన్నా ఒక కొండ ఎక్కి, కొండ చివరలో సిగ్నల్ వచ్చే ప్రాంతానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

### ఆగస్టు 15న ప్రాణాలతో బయటపడ్డ ఉపాధ్యాయుడు

ఆగస్టు 15న జెండా వందనం కార్యక్రమం అనంతరం తిరిగి వస్తున్న సమయంలో వాగు పొంగిపొర్లడంతో ఉపాధ్యాయుడు రమేష్ తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. ఈత రావడంతో రెండుసార్లు వాగులో కొట్టుకుపోయినా, ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డారు. ప్రాణాలతో బయటపడటమే గొప్పగా అనిపించింది అని ఆయన తెలిపిన ఘటన గ్రామ పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తోంది.

### పవన్ కళ్యాణ్ దృష్టికి ఏరువాడ సమస్యలు

ఏరువాడ గ్రామ ప్రజల జీవన పరిస్థితులను మృదుల మేడమ్ క్షేత్రస్థాయిలో తెలుసుకుని, పూర్తి వివరాలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి రహదారి, తాగునీరు, పాఠశాల వంటి కనీస మౌలిక సదుపాయాల అవసరాన్ని వివరించారు.

సమస్య తీవ్రతను తెలుసుకున్న పవన్ కళ్యాణ్ స్పందించి, ఏరువాడ గ్రామ అభివృద్ధికి సుమారు రూ.10 కోట్ల నిధులతో రహదారి, తాగునీరు, పాఠశాల తదితర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టడం గిరిజన గ్రామానికి కొత్త భరోసాను ఇచ్చింది.

### వెంటనే స్పందించిన టిడ్కో చైర్మన్

ఏరువాడ పరిస్థితులను తెలుసుకున్న ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ వెంటనే స్పందించి గ్రామ ప్రజలకు అండగా నిలిచారు. సుమారు 150 కుటుంబాలకు మెడికల్ కిట్లు, విత్తనాలు అందించడంతో పాటు, పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా భోజన ఏర్పాట్లు చేసి గిరిజనులకు ఆత్మీయతను చాటారు. మారుమూల గిరిజన గ్రామం సమస్యను క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దృష్టికి తీసుకెళ్లిన మృదుల మేడమ్, ఏరువాడలో విద్యా వెలుగులు పంచుతున్న ఉపాధ్యాయుడు సవలం రమేష్ సేవలు, స్పందించిన టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్, సమస్యను పరిష్కారం దిశగా తీసుకెళ్లిన పవన్ కళ్యాణ్‌కు చింతూరు మండల జనసైనికులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కొండల మధ్య చిక్కుకున్న ఏరువాడకు అభివృద్ధి రహదారి వేయడమే కాదు.. అక్కడి గిరిజనుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు రూ.10 కోట్ల అభివృద్ధి బాటలు వేయడం జనసేన చొరవకు నిదర్శనం అని స్థానికులు పేర్కొంటున్నారు.



## ఆసియా కప్ ట్రోఫీ వద్దు.. భారత్‌ను ఓడించాలన్న పాక్ అభిమాని.. టీమిండియా ఫ్యాన్స్ కౌంటర్

- సోషల్ మీడియాలో పాక్ ఫ్యాన్ వీడియో వైరల్
- కౌంటర్లు ఇస్తున్న టీమిండియా ఫ్యాన్స్
- మహిళల ఆసియా కప్‌లో సెమీస్‌కు చేరిన భారత్, పాకిస్థాన్
- సెమీస్‌లో గెలిస్తే ఫైనల్లో మరోసారి దాయాదుల పోరుకు అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ఆసియా కప్ 2026 టోర్నీ సందర్భంగా పాకిస్థాన్‌కు చెందిన ఓ అభిమాని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై భారత క్రికెట్ అభిమానులు తమదైన శైలిలో ధీటుగా బదులిస్తున్నారు. దుబాయ్ వేదికగా హాంగ్‌కాంగ్‌తో జరిగిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన పాకిస్థాన్ మహిళల జట్టు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది.
ఈ మ్యాచ్ అనంతరం పాక్ జట్టు హెడ్ కోచ్ వహాబ్ రియాజ్‌తో ఓ అభిమాని మాట్లాడుతూ, "మాకు ఆసియా కప్ ట్రోఫీ అవసరం లేదు, భారత జట్టును ఓడిస్తే చాలు" అని కోరాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యాఖ్యలపై టీమిండియా అభిమానులు ఘాటుగా స్పందిస్తున్నారు. "వారు క్రికెట్‌ను యుద్ధంలా, యుద్ధాన్ని ఆటలా పరిగణిస్తారు. కానీ రెండు చోట్లా వారికి ఓటమి తప్పదు" అని ఒకరు వ్యాఖ్యానించగా, "మొన్నటి ఓటమి షాక్ ఇంకా సరిపోలేదా? ఫైనల్‌కు రండి, ఈసారి టీమిండియా అంతకంటే గట్టిగా బుద్ధి చెబుతుంది" అంటూ మరొక అభిమాని ఎద్దేవా చేశాడు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సెప్టెంబర్ 10న జరగనున్న సెమీస్‌లో బంగ్లాదేశ్ లేదా యూఏఈ విజేతతో భారత్ తలపడనుంది. మరో సెమీ ఫైనల్‌లో పాకిస్థాన్ జట్టు శ్రీలంకను ఢీకొట్టనుంది. ఈ రెండు మ్యాచుల్లోనూ భారత్, పాకిస్థాన్ విజయం సాధిస్తే, సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్‌లో దాయాదుల మధ్య మరో హై వోల్టేజ్ పోరు ఖాయం కానుంది.

# అలాంటప్పుడే నా బెస్ట్ గేమ్ బయటకొస్తుంది.. ఇషాన్ కిషన్ ఆసక్తికర వ్యాఖ్యలు

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ 270 పరుగులు
- దులీప్ ట్రోఫీలో ఎనిమిదో అత్యధిక వ్యక్తిగత స్కోరు
- ఒత్తిడిలోనే తన బెస్ట్ గేమ్ బయటకు వస్తుందన్న కిషన్
- జట్టు లక్ష్యాలను చిన్న భాగాలుగా చేసుకుని ఆడినట్లు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి పెరిగినప్పుడే తనలోని అత్యుత్తమ ఆట బయటకు వస్తుందని భారత బ్యాటర్, ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన తర్వాత అతడు తన ఆటతీరుపై ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. చెపాక్‌లో జరిగిన మ్యాచ్‌లో కిషన్ 334 బంతుల్లో 270 పరుగులు చేశాడు. ఇందులో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అతడి ఇన్నింగ్స్‌తో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో కిషన్ 270 పరుగులు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడి తన ఆటకు మరింత ఉపయోగపడుతుందని కిషన్ చెప్పాడు. వికెట్లు త్వరగా పడిపోయిన సందర్భాల్లో కూడా తాను బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తానన్నాడు. ప్రశాంతంగా ఉంటూనే దూకుడుగా ఆడటం తనకు బాగా కలిసొస్తుందని వివరించాడు. తన వ్యక్తిగత స్కోరుపై కాకుండా జట్టు లక్ష్యంపై దృష్టి పెట్టినట్లు కిషన్ తెలిపాడు. 400 పరుగులు పూర్తయితే ముందుగా 450కి చేరుకోవాలని.. తర్వాత 500 పరుగుల లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పాడు. ఇలా చిన్న చిన్న లక్ష్యాలుగా విడగొట్టుకోవడం వల్లే సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడగలిగానన్నాడు. చెపాక్‌లో పరిస్థితులు బ్యాటర్లకు అంత సులభంగా లేవని కిషన్ చెప్పాడు. మైదానం ఒకవైపు బౌండరీ చాలా దూరంగా ఉండటంతో షాట్లకు ఎక్కువ శ్రమ పెట్టాల్సి వచ్చిందన్నాడు. బంతి మెత్తబడటంతో బౌండరీలు సాధించడం మరింత కష్టంగా మారిందని తెలిపాడు. మహ్మద్ సిరాజ్ షార్ట్ బాల్స్ వేసినప్పుడు వికెట్ కోల్పోకుండా ఉండేందుకు తన బ్యాటింగ్ భంగిమను మార్చుకున్నట్లు కిషన్ చెప్పాడు. బంతిని బలంగా కొట్టే ప్రయత్నంలో వికెట్ చేజారకుండా జాగ్రత్త పడ్డానన్నాడు. కుమార్ కుషాగ్రతో కలిసి కిషన్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. కుషాగ్ర 132 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఆ తర్వాత కూడా కిషన్ అదే జోరును కొనసాగించాడు. 270 పరుగుల వద్ద లాంగ్‌ఆన్ సమీపంలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ట్రిపుల్ సెంచరీకి అతడు 30 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. తన భారీ ఇన్నింగ్స్‌లో షాట్లు ఆడేందుకు పెద్దగా రిస్క్ తీసుకోలేదని కిషన్ చెప్పాడు. సరైన బంతులను ఎంచుకుని ఆడటం తనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నాడు.

## నా డబ్బులు ఎగ్గొట్టారు.. నన్ను ఘోరంగా అవమానించారు: పాక్ బోర్డుపై ఆస్ట్రేలియా దిగ్గజం హాట్ కామెంట్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆధిపత్య ధోరణి, అంతర్గత కుట్రలపై ఆస్ట్రేలియా బౌలింగ్ దిగ్గజం, పాక్ మాజీ టెస్టు కోచ్ జేసన్ గిలెస్పీ సంచలన ఆరోపణలు చేశారు. పాక్ జట్టుకు శిక్షణ ఇచ్చిన సమయంలో తనను ఘోరంగా అవమానించారని, టీమ్‌లో తన పాత్రను పూర్తిగా తీసిపారేసి కనీస గౌరవం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తనకు ఇవ్వాల్సిన వేల డాలర్ల జీతం డబ్బులని పీసీబీ ఇప్పటివరకు చెల్లించకుండా ఎగ్గొట్టిందని ఆరోపించాడు. బోర్డు చెప్పిన ప్రతిదానికీ తల ఊపేందుకు తాను సిద్ధం లేనన్నారు. తన సూత్రాలను విడిచిపెట్టే ప్రసక్తి లేదని కరాఖండిగా తేల్చిచెప్పారు.

**ఆకిబ్ జావేద్ వెన్నుపోటు పొడిచాడు:**
పీసీబీ చీఫ్ సెలెక్టర్‌గా ఆకిబ్ జావేద్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే తన పరిస్థితి దారుణంగా తయారైందని గిలెస్పీ ఆరోపించారు. నేను జట్టును నడిపించే స్థాయి నుంచి ఏ అధికారమూ లేనివాడిగా మిగిలిపోయాను.. ఆకిబ్ జావేద్ నా వెనుక ఉండి నాపై కుట్రలు చేశాడు.. మైండ్ గేమ్స్ ఆడుతూ నాపై నిరంతరం విషం కక్కాడు.. ఇప్పటికీ నా ప్రదర్శనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నాడు.. అతను నాపై నెగెటివ్‌గా మాట్లాడటం ఆపకపోతే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నాడు. అతడిపై కచ్చితంగా లీగల్ యాక్షన్ తీసుకుంటానని గిలెస్పీ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

**డిప్రెషన్‌లోకి నెట్టేశారు.. క్రికెట్ వదిలేయాలనుకున్నా:**
పాకిస్థాన్ బోర్డులో ఎదురైన ఈ చేదు అనుభవాలు తన మానసిక ప్రశాంతతను దెబ్బతీశాయని జేసన్ గిలెస్పీ స్పష్టం చేశారు. పీసీబీలోని నెగెటివ్ వాతావరణంతో తనపై తనకే అనుమానం వచ్చిందని, అసలు కోచింగ్ వృత్తిలోనే కొనసాగాలా వద్దా అనే తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. గ్యారీ కిర్‌స్టన్, తాను జట్టును నాశనం చేశామంటూ ఆకిబ్ జావేద్ నిందలు వేయడంపై మండిపడ్డారు. బోర్డు పెద్దల అండ చూసుకుని ఆకిబ్ విర్రవీగుతున్నాడని, ఇతరుల అభిప్రాయాలకు అక్కడ అస్సలు విలువ లేదని దుయ్యబట్టారు.

**ఆకిబ్ ఉన్నంత కాలం పాక్ క్రికెట్ నాశనమే:**
పాకిస్థాన్ క్రికెట్ రోజు రోజుకూ దిగజారిపోవడానికి ఆకిబ్ జావేదే ప్రధాన కారణమని గిలెస్పీ స్పష్టం చేశారు. ఆకిబ్ అక్కడ ఉన్నంత కాలం పాక్ క్రికెట్ ఎప్పటికీ ముందుకెళ్లదు, వెనక్కే పోతుంది. ఏసీ గదుల్లో కూర్చునే బోర్డు పెద్దలు మైదానంలో ఆడే కెప్టెన్లను ఎంపిక చేయడం ఏంటి? ఇది ముమ్మాటికీ మూర్ఖత్వం.. సరైన కోచ్‌ను నియమించి అతనికి పూర్తి స్వేచ్ఛ ఇస్తేనే జట్టు బాగుపడుతుంది. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ ఒక పెద్ద గందరగోళంలో కూరుకుపోయిందని పాక్ క్రికెట్ పతనంపై జేసన్ గిలెస్పీ విశ్లేషించారు.

## పార్ట్ టైమ్ సేవింగ్స్.. రూ.100 కోట్ల సినిమా!







21 ఏళ్ల వయసులో మూడేళ్ల పాటు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసి దాచుకున్న డబ్బంతా ఒక సినిమాపై పెట్టడం చిన్న నిర్ణయం కాదు. అనుప్రియా నాగర్ మాత్రం అదే చేసింది. యూకేలో చదువుకుంటూ సంపాదించిన తన సేవింగ్స్‌ను హనుమాన్ అంష్ కోసం పెట్టింది. సినిమా నిర్మాణంలో అనుప్రియతో పాటు మరికొందరు నిర్మాతలు కూడా ఉన్నారు. ఇప్పుడు రూ.2 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా ఇండియాలో రూ.100 కోట్ల మార్క్ దాటింది. అసలు అనుప్రియకు సినిమా ఆలోచన కూడా విచిత్రంగానే వచ్చింది. యూనివర్సిటీ ఆఫ్ బాత్‌లో ఎకనామిక్స్ చదువుతున్నప్పుడు స్టీవ్ జాబ్స్‌పై ఒక అసైన్‌మెంట్ చేసింది. అప్పుడే ఆయనకు నీమ్ కరోలి బాబాతో ఉన్న ఆధ్యాత్మిక కనెక్షన్ గురించి తెలిసింది. అక్కడి నుంచి నీమ్ కరోలి బాబా గురించి చదవడం మొదలుపెట్టి, చివరకు అదే విషయాన్ని సినిమా వరకు తీసుకొచ్చింది. చదువు పూర్తయ్యాక అనుప్రియకు జ్యూరిచ్‌లో ఉద్యోగం కూడా వచ్చింది. కానీ 2025లో ఇండియాకు తిరిగొచ్చి హనుమాన్ అంష్ నిర్మాణంలో భాగమైంది. అప్పటివరకు ఆమెకు సినిమా నిర్మాణంలో అనుభవం లేదు. అయినా యూకేలో మూడేళ్లు పార్ట్ టైమ్ పనులు చేసి దాచుకున్న సేవింగ్స్ మొత్తం ఈ ప్రాజెక్ట్‌లో పెట్టినట్టు అనుప్రియ స్వయంగా చెప్పింది.
విశాల్ చతుర్వేది దర్శకత్వంలో నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా హనుమాన్ అంష్ తెరకెక్కింది. మొదట సినిమా ప్రయాణం అంత ఈజీగా సాగలేదు. విడుదల తర్వాత ఒక దశలో స్క్రీన్స్ భారీగా తగ్గిపోయాయి. అక్కడి నుంచి మౌత్ టాక్ తో పరిస్థితి మారింది. మళ్లీ స్క్రీన్స్ పెరుగుతూ వెళ్లాయి. ఐదో వారానికి వచ్చేసరికి ఇండియా కలెక్షన్స్ రూ.100 కోట్లను దాటాయి. ప్రస్తుతం రూ.120 కోట్లకు పైగా నెట్ వచ్చినట్టు బాక్సాఫీస్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. అనుప్రియ మాత్రం తనకు కలెక్షన్స్ కంటే నీమ్ కరోలి బాబా గురించి యువత తెలుసుకోవడమే ముఖ్యమని చెబుతోంది. విదేశీయుల ద్వారా ఆయన గురించి మొదట తెలుసుకోవాల్సి రావడం తనకు బాధగా అనిపించిందని కూడా చెప్పింది. అందుకే ముఖ్యంగా యువతకు ఆయన కథ చేరాలనే ఉద్దేశంతో సినిమా చేసినట్టు తెలిపింది. హనుమాన్ అంష్‌కు ఇప్పుడు సీక్వెల్ కూడా రాబోతోంది. అయితే మొదటి సినిమా హిట్ అయిందని ఈసారి బడ్జెట్‌ను భారీగా పెంచే ఆలోచనలో లేరట. రూ.2 కోట్లలో చేసిన మొదటి సినిమాలో ఉన్న సింప్లిసిటీ, రా ఫీల్ అలాగే ఉండాలని అనుప్రియ చెబుతోంది. మొదటి సినిమా చివర్లోనే రెండో భాగానికి హింట్ ఇచ్చారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965